క్లుప్తంగా

జేవీఎల్‌కు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌ను అందుకుంటున్న జేవీఎల్ నరసింహరావు

ముమ్మిడివరం: హర్యానా రాష్ట్రానికి చెందిన మేజిక్ అండ్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆంగ్లోపాధ్యాయుడు జేవీఎల్ నరసింహరావుకు డాక్టరేట్ పురస్కారం అందించింది. విద్యా, సామాజిక రంగాలలో జేవీఎల్ అందించిన సేవలకు ఈ పురష్కారం వరించింది. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. జేవీఎల్‌ను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జగతా జానకీరామయ్య, ప్రద్మనాభరావు, జే సత్యనారాయణ, పీవీవీ సత్యనారాయణరాజు తదితరులు అభినందించారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



మునిపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రామచంద్రరావు

ఉప్పలగుప్తం: ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు సూచించారు. మునిపల్లి గ్రామ పంచాయతీ పరిధి కోటిగట్టు ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఖరీఫ్ సాగు నేపథ్యంలో ముంపునకు తావు లేకుండా, సాగునీరు ప్రవహించేలా కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పులసుగంటి సోమేష్, దోనిపాటి బాలయ్య, దోనిపాటి సత్యనారాయణ, కామిశెట్టి ఏసు ఉన్నారు.

మండల పరిషత్‌కు చేరిన డస్ట్‌బిన్లు



పరిషత్ కార్యాలయంలో ఉన్న డెస్ట్‌బిన్లు

కాట్రేనికోన: గత ప్రభుత్వంలో చెత్త సేకరించేందుకు పంచాయతీలకు సరఫరా చేసిన డస్ట్ బిన్లు బుధవారం కాట్రేనికోన మండల పరిషత్‌కు చేరాయి. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన డస్ట్ బిన్లు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు పంపిణీ చేసిన అధికారులు కాట్రేనికోనకు ఆలస్యంగా పంపించారు. ప్రజలకు ఎప్పటికి చేరుతాయో వేసి చూడాలని స్థానికులు అంటున్నారు.

మత్స్యకార విద్యార్థులకు ప్రోత్సాహకాలు

యానాం: పుదుచ్చేరి మత్స్యశాఖ ద్వారా యానాం నియోజకవర్గ పరిధిలో నివసిస్తున్న మత్స్యకార విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నట్టు మత్స్యశాఖ సహాయ సంచాలకులు దడాల గౌంతియ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో 70 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి రూ.7,500, 60 శాతం నుంచి 70 శాతం వచ్చిన వారికి రూ.5వేలు, 12వ తరగతిలో 70 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి రూ.15 వేలు, 60 శాతం నుంచి 70 శాతం మార్కులు సాధించిన వారికి రూ.7 వేలు నగదు బహుమతి అందజేస్తున్నట్టు తెలిపారు. ఆయా విద్యార్థులు నగదుబహుమతి పొందడానికి వచ్చే నెల 9వ తేదీలో సంబంధిత దరఖాస్తును పూర్తి చేసి మత్స్యశాఖ కార్యాలయంలో అందించాలని కోరారు.

టీచర్ మధు సేవలు చిరస్మరణీయం



సభలో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి ప్రవీణ్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా సేవలు అందించి ఇటీవల అకాల మృతి చెందిన వాసిరెడ్డి మధుసూదనరావు విద్యాసేవలు చిరస్మరణీయమైనవని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సౌమ్యుడిగా ఉంటూ ఉపాధ్యాయుడిగా పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల పురోగతి అంశాలను క్రమశిక్షణతో చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. అంత ముందు పలువురు మధు చిత్ర పటానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, హంసాని రామలక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు పోయేదెలా..

- ఆక్రమణలో మురుగునీటి కాలువలు
- పేరుకుపోయిన గుర్రపుడెక్క
- మరమ్మతులకు నోచుకొని డ్రైన్లు
- ఏటా వేలాది ఎకరాల పంట నష్టం



ముమ్మిడివరం డ్రైన్లలో ముంపునీరు దిగేందుకు అవరోధంగా ఉన్న గుర్రపు డెక్క



బందరపాలెం- కొత్తలంకలో మధ్యతరహా కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ముమ్మిడివరం: మురుగునీటి కాలువలు రైతుల పాలిట శాపంగా మారాయి. ఈ కాలువలు ఆక్రమణలకు గురవడంతోపాటు తూడు, గుర్రపు డెక్కతో పేరుకుపోయి మురుగునీరు దిగేందుకు అవరోధంగా ఉన్నాయి. దీంతో ఏటా వేలాది ఎకరాలు పంట భూములు ముంపుబారినపడుతున్నాయి. ఎంతో మంది రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు.

అధ్వానంగా తయారై..

1991–92లో ప్రపంచ బ్యాంకు నిధులతో ప్రధాన మురుగునీటి కాలువలను ఆధునీకరించారు. ఆ తర్వాత తాత్కాలిక మరమ్మతులు తప్ప శాశ్వత చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో డ్రైన్లు ఆధునీకరణకు రూ.9కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ తరువాత ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో డ్రైన్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షా కాలంలో ముంపు నీరు దిగువకు దిగక పంట భూములు, పంట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవి. దీంతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడడమేకాక ఎంతో నష్టాన్ని చూసేవారు.

మురుగునీరు పోయే డ్రైన్లు ఇవే..

ప్రతి ఏటా ముమ్మిడివరం మండలంలో 1600 ఎకరాలు .పోలవరంలో 2 వేల ఎకరాలు, తాళ్లరేవు మండలంలో వెయ్యి ఎకరాలు ముంపుబారిన పడుతున్నాయి. వర్షాలు అధికంగా ఉంటే వీటి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. నియోజకవర్గంలో రెండు ప్రధాన మురుగునీటి కాలువలు ఏడు మధ్యతరహా మురుగునీటి కాలువలు, 89 మైనర్ డ్రైన్లు ఉన్నాయి. ప్రధాన మురుగునీటి కాలువలు 35 కిలో మీటర్లు, మధ్యతరహా మురుగునీటి కాలువలు 57 కిలోమీటర్లు, చిన్నతరహా మురుగునీటి కాలువలు 280 కిలో మీటర్లు విస్తరించి ఉన్నాయి. ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలల్లో పూర్తిగాను, ఉప్పలగుప్తం మండలంలో కొంత భాగం కలిసి సుమారు 40 వేల ఎకరాలు ముంపుబారిన పడకుండా మురుగునీటిని సముద్రంలోకి మళ్లించేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. అంతేకాకుండా 30 వేల ఎకరాలలో కొబ్బరితోటలు, 12 వేల ఎకరాలలో ఆక్వా చెరువులలో మురుగునీరు బయటకు వెళ్లేందుకు ఇవే సహకరిస్తున్నాయి.

మరమ్మతుల్లేక..

అమలాపురం–అయినాపురం, వృద్ధగౌతమి ప్రధాన మురుగునీటి కాలువ, బొండాయికోడు, అయినాపురం, ముమ్మిడివరం మధ్య తరగతి కాలువలు ఆక్రమణలకు గురవ్వడంతో పలు చోట్ల గట్లు కుంగిపోయి ముంపునీరు చేలను ముంచెత్తుతున్నాయి. ఇటీవల డెల్టా మోడరైజేషన్‌లో భాగంగా లక్షలాది రుపాయలతో కొన్ని మైనర్ డ్రైన్లలో తూతూ మంత్రంగా పూడిక తీత పనులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకొన్నారు. మేజర్ డ్రైన్లు ఆధునీకరించకుండా మైనర్ డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టినా ప్రయోజనం ఉండదని రైతులు చెబుతున్నారు. మేజర్ డ్రైన్లు నుంచి మురుగునీరు మైనర్ డ్రైన్లకు వస్తుంది. అక్కడ మరమ్మతులు చేయకుండా చిన్నడ్రైన్లను చేయడం ఏంటి ప్రయోజనమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రైన్లు ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నీలపల్లిలో ఉపాధ్యాయుల ఇంటింటి సర్వే



నీలపల్లిలో సర్వే చేస్తున్న హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు

తాళ్లరేవు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్న ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. దీనిలో భాగంగా నీలపల్లి గ్రామ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె. రాధాకృష్ణ బృందం ఇంటింటి సర్వే నిర్వహించి, సుమారు వంద మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చేశారు. పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో సాధించిన ప్రగతి, సదుపాయాలు, పథకాలను వివరిస్తూ పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. నీలపల్లి హైస్కూల్ పరిధిలో ఇప్పటివరకూ 95 మంది విద్యార్థులు చేరినట్లు హెచ్‌ఎం రాధాకృష్ణ తెలిపారు. హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు ఫణినాధశర్మ, వీరబాబు, వీవీ సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులకు నిరసన



అమలాపురంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ, భజరంగ దళ్ ప్రతినిధులు

అమలాపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన

అమలాపురం టౌన్: జమ్ము కాశ్మీర్‌లోని వైష్ణో మాత ఆలయంలోకి వెళుతున్న హిందూ భక్తులపై ఉగ్రవాదులు చేసిన దాడులను నిరసిస్తూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ దళ్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు స్థానిక గడియారం స్తంభం సెంటరులో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ దాడుల్లో ఉగ్రవాదుల ఘాతుకానికి బలైన పది మందికి పైగా హిందువులకు ఆత్మ శాంతి కలగాలని కోరుతూ నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాదులను తక్షణమే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. రాష్ట్ర భజరంగ దళ్ సహ ప్రముఖ్ శిరంగు నాయుడు, నగర ప్రముఖ్ ఊటుకూరి సాంబయ్య, వీహెచ్‌పీ ప్రతినిధులు భీమనాథం రవి కృష్ణ, కర్రి పార్థసారథి, దొంగ రామకృష్ణ, పిచ్చుక సుబ్రహ్మణ్యం, వాండ్రపు కన్నా తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



అంబేడ్కర్‌నగర్ ఎలెవెన్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్

సీచమ్ ట్రోఫీ–2024 విజేత అంబేడ్కర్‌నగర్ ఎలెవెన్

యానాం: యువకులు క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో గత నెల రోజులుగా యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోయేషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీచమ్ ట్రోఫీ–2024 విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత నెల రోజులుగా వివిధ జట్లు తమ క్రీడా ప్రతిభను చాటారని అభినందించారు. అనంతరం విజేత జట్టు అంబేడ్కర్‌నగర్ ఎలెవెన్ జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఫైనల్స్‌లో అంబేడ్కర్ నగర్ ఎలెవెన్ జట్టు నాగా ఎలెవెన్స్‌పై విజయం సాధించారు. మొదటి బ్యాటింగ్ చేసిన అంబేడ్కర్‌నగర్ ఎలెవెన్ జట్టు 182 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు నాగా ఎలెవెన్స్ 110కు ఆలౌట్ అయ్యి రన్నర్స్‌గా నిలిచారు. మూడో స్థానాన్ని కేవీఆర్ జట్టు కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, అధ్యక్షుడు పి.రమేష్, సెక్రటరీ కె.సుబ్బారావు, జాయింట్‌సెక్రటరీ చిట్టి, కె.ప్రసాద్, పి.ప్రసాద్, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ పంతగడ సుమన్‌బాబు, సత్యం, కె.జయచంద్ర, కె.సత్యనారాయణ, పీఈటీలు పాలికి ప్రకాష్, చింతా వెంకన్న పాల్గొన్నారు.

కూటమి నేతల సంబరాలు



అమలాపురంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న టీడీపీ, జనసేన నాయకులు

అమలాపురం టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రిగా పవన్ కల్యాణ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అమలాపురంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు స్థానిక గడియారం స్తంభం సెంటరులో సంబరాలు జరుపుకొన్నారు. ఆ సెంటరులో భారీ ఎస్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రిగా వాసంశెట్టి సుభాష్ ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యాలను వీక్షించారు. రామచంద్రపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌ది అమలాపురం కావడంతో స్థానిక శ్రీరామనగర్‌లోని సుభాష్ ఇంటి వద్ద ఆయన కుటుంబీకులు, అభిమానులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. గడియారం స్తంభం సెంటరులో కూడా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మంత్రి సుభాష్ విజయంపై రెండు పార్టీల నాయకలు వేడుకలు జరిపారు.

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్‌లో నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు తిలికించేందుకు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా మండల కేంద్రమైన తాళ్లరేవు గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకించారు.

కాట్రేనికోన: శెట్టిబలిజ సామాజిక వర్గంను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గంలో వాసంశెట్టి శుభాష్‌కు స్థానం కల్పించడంపై కాట్రేనికోన మండలంలో గేటు సెంటరులో సంబరాలు చేసుకున్నారు. అభిమానులు బాణ సంచా కాల్చి, కేక్ కట్ చేశారు. రాష్ట్ర మంత్రి వర్గం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా గ్రంధి సోమరాజు కల్యాణ మండపంలో డిజిటల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి వీక్షించారు. సీఎం ప్రమాణ స్వీకారం సందర్భంగా టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు కేక్‌లను కట్ చేశారు. బైక్ ర్యాలీ చేపట్టినారు.

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్గ ప్రమాణ స్వీకార సందర్భంగా అమలాపురం మండల కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ఎల్ఈడీస్క్రీన్ ద్వారా తిలకించారు.

నేడు మోగనున్న బడిగంట

- ఆటలకు ఇక సెలవు
- స్కూళ్ల బాట పట్టనున్న పిల్లలు
- పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠశాలలో విద్యార్థులు

అమలాపురం రూరల్: వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి బడిగంట మోగనుంది. విద్యార్థులు ఆటవిడుపులకు బైబై చెప్పి పుస్తకాలు పట్టుకొని పాఠశాల బాట పట్టనున్నారు. నిన్నటి వరకు బోసిపోయిన స్కూళ్లు మళ్లీ కళకళలాడనున్నాయి.

వేసవి సెలవలు అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. గత విద్యాసంవత్సరంలో సాధించిన ఫలితాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉత్సాహంగా కొత్త విద్యాసంవత్సరానికి స్వాగతం పలుకుతున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు పాఠశాలలకు చేరుకున్నాయి. అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోని 25 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒక ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, 268 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 15,265 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉన్నత పాఠశాలలు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఉత్తీర్ణత సాధించాయి.

జగన్ ప్రభుత్వం పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడంతో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలను నూతన భవనాలు ఆధునీకరణ చేసి, సదుపాయాలు కూడా పెంచారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు డిమాండ్ పెరిగింది. పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను జగన్ ప్రభుత్వం అందజేసింది. ప్రభుత్వం ఇంకా 7వ తరగతి పాఠ్యపుస్తకాలు విడుదల చేయలేదు.

విద్యాప్రమాణాల మెరుగుకు కృషి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. గతేడాది పదో తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల్లో 92 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఇప్పుడు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధన జరుగుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి. అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ఈ విద్యాసంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తాం.

– గుబ్బల సూర్య ప్రకాశరావు, ఎంఈఓ, అమలాపురం

పింఛనుదారుల సంఘ గౌరవ అధ్యక్షుడిగా బాపూజీ



ఆలమూరు: ఆలమూరు తాలూకా పింఛన్ల సంఘ గౌరవ అధ్యక్షుడిగా కేవీఆర్ బాపూజీ నియమితులయ్యారు. స్థానిక పింఛనర్ల సంఘ కార్యాలయంలో బుధవారం తాలుకా పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన పింఛనర్ల సంఘ సమావేశం జరిగింది. సభ్యులందరూ బాపూజీని గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మా ట్లాడుతూ యూటీఎఫ్‌లో వివిధ విభాగాల్లో పనిచేసిన అనుభవంతో పింఛనర్ల సంఘ అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సహచర సభ్యులందరూ బాపూజీని ఘనంగా సత్కరించారు.

పద్దయ్యకు ఘన నివాళులు

ఆలమూరులో ఇటీవల మృతి చెందిన పింఛనర్ల సంఘ నాయకుడు బత్తుల పద్దయ్య సంతాప సభ జరిగింది. ఈసందర్భంగా సభ్యులందరూ పద్దయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

అడ్మిషన్లు ప్రారంభం

కొత్తపేట: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు బుధవారం తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో 8 సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌లో విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. బీఏ (ఎకనామిక్స్), బీఏ (పొలిటికల్ సైన్స్), బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (మేథమెటిక్స్), బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (జువాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పై కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, లైబ్రరీ, నూతన కంప్యూటర్ ల్యాబ్, జిమ్ తదితర సౌకర్యాలన్నీ కళాశాలలో ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులందరికీ ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, అన్ని సౌకర్యాలతో, ఉన్నత ప్రమాణాలతో క్లాసులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ అడ్మిషన్లు కావలసిన విద్యార్థులు 2 పాస్‌పోర్టు సైజు ఫొటోస్, ఆధార్ కార్డు, ఇంటర్మీడియెట్ మార్క్స్ లిస్టు, టీసీ, స్టడీ, పదో తరగతి మార్క్స్ లిస్టు, ఒరిజినల్, ఫొటో స్టాట్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లు 9704302775, 9849711253లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

జీజీహెచ్‌లో సక్రమంగా అందని వైద్యసేవలు

- ప్రశ్నించిన బీజేపీ తదితర నాయకులు
- డీడీ రవిశంకర్‌తోపాటు ఆసుపత్రి పరిశీలన



జీజీహెచ్ డీడీతో సమావేశమైన నాయకులు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గడువు తేదీ దాటిన మందులు వినియోగిస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. జీజీహెచ్‌లో సరైన వైద్యసేవలు అందకపోవడంపై దుగ్గుదుర్తి అనిత, పార్వతి, గొంతు సత్యం, పలువురు బీజేపీ నాయకులు జీజీహెచ్ డీడీ రవిశంకర్‌ను బుధవారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీడీ రవిశంకర్‌తోపాటు వారు ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా మార్చురీ గదిలో మృతదేహాలను భద్రపరిచేందుకు ఉపయోగించే ఫ్రీజర్‌బాక్స్ పాడయ్యి 6 నెలలు అవుతున్నా ఎందుకు బాగుజేయలేదని వారు ప్రశ్నించారు. అదేవిధంగా గడువు తీరిన మందులను గుర్తించి సంబంధిత ఫార్మాసిస్ట్‌కు చూపించి ప్రశ్నించగా సమాధానం చెప్పడం లేదన్నారు. ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కాన్ మరమ్మతులు చేయించి వినియోగం లోకి తేవాలని కోరారు. సామాన్యులకు వైద్యం అందక కాకినాడ వెళ్లాల్సి వస్తుందని రోగ నిర్ధారణ పరీక్షలు కూడా బయటకు రాస్తున్నారన్నారు. ఈ సమస్యలపై ఎల్జీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లోవరాజు, రేఖాడి ఆదినారాయణ, మేడిశెట్టి లోవరాజు, గోపీ సురేష్, పాలెపు శ్రీను, వినయ్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

అయినవిల్లి: మండలం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ మండల మహాసభ జరిగింది. సీఐటీయూ మండల కమిటీ సభ్యురాలు గుత్తుల వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుడే దుర్గాప్రసాద్ ప్రతినిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ వర్కర్స్ సమస్యలను, కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఇలా పలు డిమాండ్లు చేశారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా ఇసుకపట్ల మంగమ్మ, కోకన్వీనర్లుగా సుంకర నాగవేణి, గుత్తుల వెంకటలక్ష్మి, బూల ఉమామహేశ్వరి, ఈతకోట శ్రీనివాసరావు, రాయుడు శ్రీనివాసరావు, నేదునూరు లవరాజు, బండి లక్ష్మీదేవి మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



మోరిలో విద్యార్థులకు కిట్లు పంచుతున్న సుబ్రహ్మణ్యం

సఖినేటిపల్లి: 2024–25 విద్యా సంవత్సరానికిగాను మండలంలోని వివిధ పాఠశాలలకు బుధవారం విద్యార్థుల కిట్లు పంపిణీని జిల్లా సమగ్ర శిక్షా అధికారి(సీఎంవో) బీవీవీ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. మండలంలోని పాఠశాలలు అన్నింటికీ స్టాక్ పాయింట్‌గా ఉన్న మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నుంచి వీటిని పాఠశాలల బోధన సిబ్బందికి ఆయన అందజేశారు. ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, సీఆర్‌పీలు, పార్ట్ టైం టీచర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం మేరీమాత వృద్ధుల ఆశ్రమంలో మోరి గ్రామానికి చెందిన ప్రముఖ దాత, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు జాన నాగమల్లయ్య 103వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను నాగమల్లయ్య తనయుడు, మోరి చేనేత సొసైటీ చైర్మన్ జాన శంకరరావు కట్ చేసి వృద్ధులకు పంచారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. నాగమల్లయ్య చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.